క్లుప్తంగా

కమనీయం.. సత్యదేవుని వ్రతం



పూజలు చేస్తున్న దంపతులు

కౌటాల: మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వేద పండితులు మహేష్ శర్మ, వొజ్జల జగదీశ్, మామిడిపల్లి నరేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో అంగరంగ వైభవంగా వ్రతం నిర్వహించారు. కౌటాల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కౌటాల, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్ మండలాలతో పాటు మహారాష్ట్ర నుంచి 108 జంటల దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతంలో పాల్గొని పూజలు చేశారు. దీంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బొమ్మకంటి మనీశ్, సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, ఆలయ కమిటీ అధ్యక్షులు వొజ్జల వెంకన్న, కౌటాల మాజీ సర్పంచ్ మౌనిశ్, మహేశ్, ప్రశాంత్, శ్రావణ్, దేవయ్య, హన్మంతు, సత్తయ్య పాల్గొన్నారు.

108 సేవలు వినియోగించుకోవాలి



తనిఖీ చేస్తున్న అధికారులు

వాంకిడి: ప్రజలు 108 సేవలను వినియోగించుకోవాలని అంబులెన్స్ రాష్ట్ర కార్యాలయ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ అధికారి కిశోర్ అన్నారు. గురువారం మండల ఆసుపత్రి ఆవరణలో 108 వాహనాన్ని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వామీట్‌తో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వాహనంలో ప్రాథమిక వైద్య పరికరాలు, అందుబాటులో ఉన్న మందులు, మెడికల్ కిట్‌లు, రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు అందించి వారి పనితనాన్ని మెచ్చుకున్నారు. ఆపద సమయంలో 108 కి ఫోన్ చేసే వారికి వెంటనే స్పందించి సకాలంలో వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఎమ్ఈ సతీష్, ఈఎంటీ రజినీకాంత్, పైలెట్ భీంరావు ఉన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వేసవిలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయాలని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పురపాలక సంఘాల పరిధిలో ప్రతి వార్డులో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టాలని, పైపులైన్‌ల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టి నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్లు అంజయ్య, భుజంగరావ్‌లతో కలిసి హాజరయ్యారు.

కలెక్టర్‌ను కలిసిన ఐటీడీఏ పీవో



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పీవో

ఆసిఫాబాద్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా గురువారం కలెక్టర్ హేమంత్ బోర్కడేను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

దారిమళ్లుతున్న రేషన్

- రైలు, రోడ్డు మార్గాల ద్వారా అక్రమ రవాణా
- మాజీ నేతల అండదండలు.. రెచ్చిపోతున్న అక్రమార్కులు
- అధికారుల పరోక్ష సహకారం ఉందనే ఆరోపణలు
- ఇటీవల రైస్ మిల్లులో దాడులు.. 6–ఏ కేసు నమోదు
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు



వేంపల్లిలో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు (ఫైల్)

బెజ్జూర్: పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. దళారులు అక్రమంగా పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాజకీయ అండదండలతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. మరోవైపు అధికారులు సైతం పరోక్ష సహకారాన్ని అందిస్తుండటంతో దళారులకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. కుమురంభీం జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణం మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉండటంతో రేషన్ బియ్యం పెద్ద ఎత్తున సరిహద్దులు దాటుతోంది. కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే స్టేషన్, చింతగూడ, నవేగాం బస్తీ ప్రాంతాల్లో ఈ దందా సాగుతోంది. రైలు, రోడ్డు మార్గాల ద్వారా పీడీఎస్ బియ్యం యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతోంది.

సరిహద్దులు దాటుతున్న దందా..

కుమురంభీమ్ జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణం మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉండటంతో రేషన్ బియ్యం పెద్ద ఎత్తున సరిహద్దులు దాటుతోంది. రైలు, రోడ్డు మార్గాల ద్వారా యథేచ్ఛగా తరలిస్తున్నారు. గ్రామాల్లో బియ్యాన్ని సేకరించి మరీ అదునుచూసి లారీలు, ఐచర్ వ్యాన్లు, చివరకు ద్విచక్ర వాహనాల ద్వారా సైతం తరలిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పీడీఎస్ బియ్యం దళారులు గ్రామాల్లో తిరుగుతూ లబ్దిదారుల నుంచి కిలో రూ.8 నుంచి రూ.12 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని క్వింటాళ్ల చొప్పున అక్రమ రవాణా చేసి తెలంగాణ సరిహద్దు మహారాష్ట్ర వీరూర్, బల్లార్షా, చంద్రాపూర్లోని కొన్ని ప్రాంతాల దుకాణాలకు చేరవేస్తూ అక్కడ క్వింటాల్‌కు రూ.2100 నుంచి రూ.2500 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

నేతల అండదండలతో..

కాగజ్‌నగర్ ప్రాంతానికి చెందిన కొందరు నేతలు ఈ బియ్యం అక్రమ రవాణా ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఈ విషయంలో ప్రభుత్వానికి ఇంటలిజెన్స్ నివేదికలు సైతం వెళ్లాయి. కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే స్టేషన్, చింతగూడ, నవేగాం బస్తీ ఏరియాల్లో ఈ దందా సాగుతోంది. సిర్పూర్(టి) మీదుగా మహారాష్ట్రకు ఈ బియ్యం సరఫరా అవుతున్నాయి. పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తూ ధనార్జనే ధ్యేయంగా దళారులు ఈ అక్రమ దందా కొనసాగిస్తుండగా సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. నెలకు కేవలం ఒకటి, రెండు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అసలు సూత్రధారులపై కాకుండా ఇతరులపై కేసులు నమోదు చేసి మమ అనిపిస్తున్నారు.

సరిహద్దు దుకాణాల్లో విక్రయాలు..

ఇక్కడి దొడ్డు బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంగా మార్చి మహారాష్ట్రలో విక్రయిస్తుండగా వీటిని ఫార్మా కంపెనీలకు, కోళ్ల ఫారాల్లో దాణా కోసం, మద్యం తయారీ కంపెనీలకు అక్రమ మార్గంలో వెళ్తున్నాయి. కొన్నిచోట్ల నూకలుగా మార్చి తీసుకెళ్తున్నారు. సిర్పూర్(టి) మండలం నుంచి వెళ్లే పెన్‌గంగ ఒడ్డున మహారాష్ట్రకు చెందిన ఫోడ్సా ఉంటుంది. ఇక్కడ పదుల సంఖ్యలో బియ్యం కొనుగోలు దుకాణాలున్నాయి. మరో 25 కిలో మీటర్ల దూరంలో గోండుపిప్రి, గోండియా, వీరూర్లో బియ్యం కొనుగోలు దుకాణాలు అనేకం. చింతలమానెపల్లి మండలం బెజ్జూర్ మండలం సోమినీ, వయగూడెం, మీదుగా మహారాష్ట్రలోని ఆహేరికి అక్రమ రవాణా సాగుతోంది. ఇక్కడ సైతం భారీ గోదాములు ఏర్పాటు చేసి పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. వాంకిడి మీదుగా వీరూర్, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు) నుంచి జివితి మీదుగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా సాగుతోంది. వీటిని ప్యాక్ చేసి, లారీల్లో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు.

బయోమెట్రిక్ ఉన్నా..

రేషన్ డీలర్లు సబ్సిడీ బియ్యాన్ని పక్కదారి పట్టించకుండా ఉండేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ యంత్రాలను తీసుకొచ్చినా దందా మాత్రం ఆగడం లేదు. కేంద్రం వద్దే వినియోగదారులు విక్రయిస్తున్నారు. ప్రతినెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక షాపుకు ఆ నెలలో వచ్చిన కోటా ఎంత..? వినియోగదారులు తీసుకున్నది ఎంత..? మిగిలిన కోటా ఎంత..? అనే లెక్కలు ఈజీగానే తెలుస్తున్నాయి. పౌరసరఫరాల శాఖాధికారులు మాత్రం షాపులను ఏ మాత్రం తనిఖీ చేయడం లేదు. రైస్ మిల్లుల్లో సైతం తనిఖీలు నామమాత్రంగానే సాగుతున్నాయి. సీఎంఆర్ ద్వారా ఇచ్చిన ధాన్యం ఎంత? మర పట్టించగా వచ్చే బియ్యం ఎంత? మర ఎంత ఆడించారు. ఎన్ని బియ్యం ఉన్నాయనే వివరాలతో తనిఖీలు చేస్తే అక్రమాలు బయటపడే అవకాశాలున్నాయి.

రైస్ మిల్లులో దాడులు..

సిర్పూర్(టి) మండలంలోని వేంపల్లిలోని శ్రీ లక్ష్మినరసింహ రైస్ మిల్లులో ఇటీవల రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేపట్టారు. రైస్ మిల్లుకు 38,265 బ్యాగుల ధాన్యం కేటాయించగా 2,174 బ్యాగుల ధాన్యం మాత్రమే అందుబాటులో ఉండగా, 36,091 వరి ధాన్యం బ్యాగులు కనుమరుగైనట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ వెల్లడించారు. దీంతో ఆ రైస్ మిల్లుపై 6–ఏ కేసు నమోదు చేశారు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఇవి యథేచ్ఛగా సాగుతున్నాయి. వీటిపై అధికారులు దృష్టి సారిస్తే పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఉంటాయని పలువురు పేర్కొంటున్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



చింతలమానెపల్లి: నిరసనలో నాయకులు



వాంకిడి: రాస్తారోకోలో మాలి సంఘం నాయకులు

చింతలమానెపల్లి: మంచిర్యాల జిల్లా కోటపెల్లి మండలం బోరంపల్లి మహాత్మాజ్యోతి బాపూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మాలి సంఘం మండల అధ్యక్షుడు నికాడె బాపురావు డిమాండ్ చేశారు. విగ్రహాలు ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ గురువారం మండలంలో నిరసన వ్యక్తం చేశారు. డబ్బా గ్రామంలోని చౌరాస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. మాలి సంఘం నాయకులు గుర్లె శ్రీనివాస్, వడాయి గణపతి, కావుడె కిరణ్, ధనంజయ్, శేఖర్, నగేష్, సంతోష్ పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో మాలి సంఘం ఆధ్వర్యంలో కౌటాల–బెజ్జూర్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు మాట్లాడుతూ మహనీయులైన పూలే దంపతుల విగ్రహాలను ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల పూలే విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు నాందేవ్, చందు, రమేశ్, బండు, సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని నాలుగు వరుసల జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మహనీయుల విగ్రహాలు ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుర్నులె నారాయణ, డివిజన్ అధ్యక్షుడు గుర్నులె మెంగాజీ, మండలాధ్యక్షుడు బాబురావు ఉన్నారు.

కొలువుదీరిన వనదేవతలు



వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు



సమ్మక్కను గద్దెపై నిలుపుతున్న పూజారులు

రెబ్బెన: సమ్మక్క సారలమ్మ జాతర మహోత్సవంలో భాగంగా గురువారం సాయంత్రం సమ్మక్కను పూజారులు గద్దెపై నిలిపారు. లక్ష్మీపూర్ శివారులో గంగాపూర్ వాగు ఒడ్డున ఉన్న గద్దెల వద్ద పూజారులు దేవార వినోద్, గొల్లపల్లి సత్తమ్మలు డప్పు వాయిద్యాలతో కంకలవనానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కంకసిల్ల, కుంకుమ బరిడీ రూపంలో ఉన్న సమ్మక్క తల్లిని డప్పు వాయిద్యాల, శివశత్తుల పూనకాల నడుమ కోలాహలంగా గద్దెల వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం సమ్మక్కకు ప్రత్యేక పూజలు నిర్వహించి బెల్లం, ఓడిబియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ తల్లులను దర్శించుకున్న భక్తులు వనదేవతలకు వస్త్రాలు, బంగారం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోళ్లు, మేకలను బలిచ్చి పూజలు చేశారు.



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే..

గోలేటి పరిధిలోని సమ్మక్క సారలమ్మ గద్దెలను మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు దర్శించుకున్నారు. వనదేవతలకు బంగారాన్ని సమర్పించి పూజలు చేశారు. జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, పీఏసీఎస్ చైర్మెన్ కార్నాథం సంజీవ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా బంద్

కౌటాల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా రెండ్రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవీందర్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని చీపురుదుబ్బ ఫీడర్‌లో శుక్ర, శని వారాల్లో మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. దీంతో రెండు రోజులు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండలంలోని గురుడుపేట, కన్నెపల్లి, బోదంపల్లి, కనికి, యాపలగూడ, గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి



ముత్యంరాజును సన్మానిస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్: పోలీసులు క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలని ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ సిద్దిపేట కమిషనరేట్‌కు బదిలీపై వెళ్తున్న సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ ముత్యంరాజును గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఉద్యోగం ఎక్కడ చేసినా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఎన్నికల సమయంలో సక్రమంగా విధులు నిర్వహించిన ముత్యంరాజును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్ స్పెషల్ బ్రాంచి ఇన్స్‌పెక్టర్ రాణాప్రతాప్, సీఐ సతీశ్, డీపీవో ఏవో శ్రీనివాస్, ఫింగర్‌ప్రింట్ విభాగం సీఐ మార్కండేయ, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆర్ఐ ఎంటీవో అంజన్న, ఎస్‌బీ ఎస్సైలు రామకృష్ణ, వెంకటేశ్, ఎస్సై మహేందర్, ఓదెలు, కిరణ్ పాల్గొన్నారు.

భూములకు రక్షణ కల్పించడండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: భూములకు రక్షణ కల్పించి, భూతగాదాలతో మా ప్రాణాలు గాలిలో కలవకముందే న్యాయం చేయాలని చింతలమానపల్లి మండలం బాలాజీ అనుకోడ నిరుపేద కుటుంబీకులు గురువారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ భూమి విషయంలో పూర్తి వివరాలు తెలుసుకొని మండలంలోని తహసీల్దార్‌కు చరవాణి ద్వారా సమాచారాన్ని ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన అదనపు కలెక్టర్ వెంటనే ఆ గ్రామానికి అధికారులను పంపించి భూములకు సంబంధించిన గొడవలను ఇకముందు జరుగకుండా చూడాలని, దౌర్జన్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు సూచించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు పనులు అడ్డుకున్న ఫారెస్ట్ అధికారులు



వివరాలు తెలుసుకుంటున్న సీఐ అంజయ్య

లింగాపూర్: మండలంలోని లోద్దిగూడా గ్రామ పంచాయతీలోని పుల్‌సింగ్‌తండా గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్డు పనులు చేస్తుండగా ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని అక్కడే ఉన్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆత్రం అనిల్ తహసీల్దార్ రాజేంద్రబాబుకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లి సమస్యకు గల కారణాలు తెలుసుకున్నారు. భూమి రెవెన్యూ పరిధిలోకి వస్తుందని ఫారెస్ట్ అధికారులకు సంబంధిత పత్రాలను చూపించారు. కార్యక్రమంలో సీఐ అంజయ్య, ఎస్సై ప్రవీణ్, సిర్పూర్ ఎస్సై రాహుల్ పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి



ఏఎన్‌ఎంలతో మాట్లాడుతున్న సుధాకర్ నాయక్

కెరమెరి: ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డీసీజేఎస్) వ్యాధిగ్రస్తుల వివరాలను పక్షం రోజుల్లోగా పోర్టల్లో అప్‌లోడ్ చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండలంలో మధుమేహ వ్యాధిగ్రస్తులు 1950, రక్తపోటు వ్యాధిగ్రస్తులు 3910 మంది ఉన్నారని, అయితే కేవలం రెండువేల మందికి సంబంధించిన వివరాలు మాత్రమే పోర్టల్‌లో అప్‌లోడ్ అయ్యాయని చెప్పారు. మిగిలిన వారి వివరాలను 15రోజుల్లోగా అప్‌లోడ్ చేయాలని, కాగా అందరికి ఆభా(ఆయూష్ మాన్ భారత్ హెడ్ అకౌంట్) తెరిచి ఉండేలా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, తదితరులున్నారు.

ఆదివాసీ మహిళల స్థితిగతులపై ఆరా



వివరాలు సేకరిస్తున్న ప్రొఫెసర్ ఉష

కెరమెరి: గోండ్వానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ మహిళల స్థితిగతులపై హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ ఉష ఆరా తీశారు. గురువారం మండలంలోని కల్లెగాం, కొటారి, అంబారావుగూడ గ్రామాలను ఆమె సందర్శించారు. ఆదివాసీ మహిళలతో మాట్లాడారు. మహిళలు చేస్తున్న వ్యవసాయం, నూతన పద్ధతులు, పోడు భూముల సమస్యలు, వారి ఆరోగ్యం, విద్య, వైద్యం అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోండ్వానా ఫౌండేషన్ చైర్మన్ సిడాం తిరుపతి, ప్రధాన కార్యదర్శి కుర్సెంగ మారుతి, సంయుక్త కార్యదర్శి కోవ ఇందిరా, సభ్యుడు బండేరావు ఉన్నారు.

'ఆరోగ్య సిబ్బంది సేవలు భేష్'

బెజ్జూర్: ఆరోగ్య సిబ్బంది సేవలు భేష్‌గా ఉన్నాయని ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా అన్నారు. మండలంలోని అంబగట్ట గ్రామపంచాయతీ రేచిని అటవీ ప్రాంతంలోని ఇందిర్గాం బీట్ ఖర్జలి రేంజ్ పరిధిలోని సమ్మక్క సారలమ్మ జాతరలో జిల్లా వైద్యాధికారి సూచన మేరకు బెజ్జూర్ సీహెచ్ పరిధిలో ఏఎన్‌ఎంలు వైద్య సేవలు అందించడంపై హర్షం వ్యక్తం చేశారు. జాతరకు వచ్చే ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు తగు మందులను పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు. అనేక సంవత్సరాలుగా సహజసిద్ధంగా ఏర్పడ్డ సమ్మక్క– సారలమ్మ వన దేవతలను దర్శించుకోవడానికి వందల సంఖ్యలో వివిధ ప్రాంతాల భక్తులు వస్తుంటారని, వారి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాచ్‌మెన్ నియామకంపై విచారణ చేపట్టాలి

రెబ్బెన: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో వాచ్‌మెన్ నియామకంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి అర్హులైన వారికే వాచ్‌మెన్ పోస్టు అందించాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. గురువారం పాఠశాల ఎదుట వాచ్‌మెన్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెబ్బెన బాలికల గురుకుల పాఠశాలలో వాచ్‌మెన్ పోస్టు ఖాళీగా ఉందనే సమాచారం మేరకు దరఖాస్తు చేసుకున్నామని, అయితే అధికారులు వాచ్‌మెన్ పోస్టు భర్తీకి ఎలాంటి నోటిఫికేషన్ విడుదల కాలేదని కొంత మంది అభ్యర్థుల దరఖాస్తులు స్వీకరించి మరికొంత మంది దరఖాస్తులను స్వీకరించకుండానే తిరస్కరించారని అన్నారు. అధికారులు తీసుకున్న దరఖాస్తులకు సైతం ఎలాంటి రసీదు ఇవ్వలేదని అన్నారు. అయితే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో అర్హులైన వారితో వాచ్‌మెన్ పోస్టును భర్తీ చేస్తారని అనుకునే లోపే ఎలాంటి నోటిఫికేషన్ విడుదల చేయకుండా గుట్టు చప్పుడు కాకుండా మండల కేంద్రానికి చెందిన ఒకరిని నేరుగా వాచ్‌మెన్ పోస్టుకు ఎంపిక చేశారని అన్నారు. నోటిఫికేషన్ విడుదల కాలేదని దరఖాస్తులను స్వీకరించేందుకే నిరాకరించి అధికారులు ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా వాచ్‌మెన్ పోస్టును ఏవిధంగా భర్తీ చేశారో తెలపాలని పట్టుబట్టారు. ఎంపిక చేసిన అభ్యర్థిని ఏ ప్రతిపాదికన ఎంపిక చేశారని ఉన్నతాధికారులు స్పందించి వాచ్‌మెన్ నియామకంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సహాయక సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి



తేనె శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న చరణ్‌దాస్

వాంకిడి: స్వయం సహాయక సంఘాల్లోని మహిళల అభివృద్ధికి కృషి చేయాలని అదనపు డీఆర్డీవో చరణ్‌దాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూపు సభ్యుల అభివృద్ధికి స్త్రీనిధి, బ్యాంకు రుణాలు అందించి టార్గెట్ పూర్తి చేయాలన్నారు. తీసుకున్న లోన్‌లు తిరిగి సకాలంలో చెల్లించేలా సభ్యులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సభ్యుల ఆసక్తి మేరకు జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే లోకోస్ యాప్‌లో సంఘాల వివరాలు నమోదు చేయడంలో వేగం పెంచాలని ఆదేశించారు. ఉదయం, రాత్రి సమయాల్లో యాప్ సర్వర్ వేగంగా ఉంటుందని ఆ సమయాల్లో సీసీలు, వివోలు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తేనె శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎంలు రామకృష్ణ, అన్నాజీ, ఏపియం మహేష్, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్కకు మొక్కుల చెల్లింపు



మొక్కులు చెల్లించేందుకు వెళ్తున్న నాయకులు

ఆసిఫాబాద్: తిర్యాణి మండలంలోని సమక్క గద్దె వద్ద డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాదరావు గురువారం మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తే నిలువెత్తు బంగారం ఇస్తామని తిర్యాణి కాంగ్రెస్ నాయకులు మొక్కిన మొక్కుల నేపథ్యంలో సమ్మక్క, సారక్కలను దర్శించుకున్నారు. ఆ పార్టీ నాయకులు అనిల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.పోచయ్య‌కుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899